సాక్షి
వైఎస్సార్ జిల్లా

శనివారం । 14 । సెప్టెంబర్ । 2024



అబలకు అండగా మహిళా కమిషన్

అబలలకు అండగా మహిళా కమిషన్ ఎల్లవేళలా పని చేస్తుందని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి తెలిపారు.

-8లో



ఏకదంతుడి లడ్డూకు డిమాండ్

లంబోదరుడి లడ్డూకు భలే డిమాండ్ లభిస్తోంది. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజైన శుక్రవారం పలు ప్రాంతాల్లో వేలం పాట నిర్వహించారు.

-8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.2/25.0

జిల్లాలో గురువారం 25.0 - 34.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు పాఠశాలలకు సెలవు

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా అన్ని యాజమాన్య పాఠశాలలకు రెండవ శనివారాన్ని పురస్కరించుకుని నేడు సెలవుదినంగా ప్రకటించినట్లు డీఈఓ మర్రెడ్డి అనురాధ తెలిపారు. జిల్లాలో భారీ వర్షాలకు.. విద్యార్థుల రక్షణ దృష్ట్యా ఈ నెల 2వ తేదీ పాఠశాలలకు సెలవు ఇచ్చిన విషయం విదితమే. సదరు సెలవుకు పరిహారంగా 14వ తేదీ రెండవ శనివారం రోజున జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాలలోని అన్ని పాఠశాలలకు వర్కింగ్ డేగా పనిచేయాలని తొలుత ఆదేశించామన్నారు. కానీ.. ఈ విద్యా సంవత్సరం పాఠశాల పనిదినాలు 220 రోజులు తక్కువ కాని కారణంగా రెండవ శనివారం 14వ తేదీ అన్ని యాజమాన్య పాఠశాలలకు సెలవును ప్రకటించినటు పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు గమనించాలని డీఈఓ సూచించారు.

నేడు ఇంటర్ కళాశాలలకు పనిదినం

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా 2వ శనివారం అన్ని యాజమాన్య ఇంటర్ కళాశాలలకు పనిదినంగా నిర్ణయించినట్లు ఇంటర్ ఆర్ఐఓ బండి వెంకటసుబ్బయ్య తెలిపారు. జిల్లాలోని అన్ని యాజమాన్య ఇంటర్మీడియట్ జూనియర్ కళాశాలలను యథావిధిగా పనిదినంగా నిర్వహించాలని ఆయన పేర్కొన్నారు.

19న జిల్లాస్థాయి యువజనోత్సవాలు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని స్పిరిట్స్ డిగ్రీ కళాశాలలో ఈనెల 19వ తేదీన యువజన సర్వీసులశాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి యువజనోత్సవాలు నిర్వహించనున్నట్లు స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్ తెలిపారు. 15 నుంచి 29 ఏళ్ల లోపు గల యువత పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. జానపద నృత్యం (గ్రూప్,సోలో), జానపద గేయం (గ్రూప్, సోలో), స్టోరీ రైటింగ్, పెయింటింగ్, కవిత్వం, డిక్లమేషన్ (హిందీ/ఇంగ్లీషు) విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల యువత ఈనెల 18లోపు పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఎవరి సామగ్రి వారే తెచ్చుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు వి.వి. సుబ్బారాయుడు 9949298810, నాగయ్య 9849497011 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

కడప అర్బన్: జాతీయ న్యాయసేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయసేవాధికారసంస్థ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా శనివారం ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 23 బెంచీలు ఏర్పాటు చేశారు. మరింత సమాచారం కోసం 08562-258622, 244622 నంబర్లో సంప్రదించాలని సూచించారు. అలాగే కడప.డికోర్ట్‌డాట్ జీఓవిడాట్ ఇన్, డిఎల్ఎస్ఏకెడిపి ఆట్‌దిడేటాఫ్ జీమెయిల్ డాట్ కామ్‌లో సంప్రదించవచ్చని తెలిపారు. కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్‌లో తమ కేసులను రాజీ చేసుకుని సత్వర న్యాయం పొందాలని.. ఈ జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలనీ జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ చైర్మన్ జి. శ్రీదేవి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ పేర్కొన్నారు.

వెలిగల్లు కుడికాలువ నీరు నిలుపుదల

గాలివీడు: వెలిగల్లు జలాశయంలో నీటి నిల్వలు తగ్గిన దృష్ట్యా కుడికాలువ నీటిని నిలుపుదల చేస్తున్నట్లు వెలిగల్లు ప్రాజక్టు డీఈఈ శిరీష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గాలివీడు, రాయచోటి మండలాలకు విధిగా శుద్ధి చేసిన నీటిని అందించాల్సి ఉందని, అందువల్ల కొంత నీటి నిల్వలను ఉంచుతున్నట్లు తెలిపారు. నీటి నిల్వలు పెరిగిన అనంతరం వ్యవసాయ అవసరాలకు నీరు అందించనున్నట్లు చెప్పారు.

నూతన కమిటీ ఎన్నిక


చెంగల్‌రెడ్డి


ఉమాకాంత్

కడప ఎడ్యుకేషన్: ఏపీటీఎఫ్ అమరావతి అన్నమయ్య జిల్లాశాఖ నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. కడప ఏపీటీఎఫ్ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సీవీ ప్రసాద్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా చెంగలరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఉమాకాంత్, అసోసియేట్ అధ్యక్షుడిగా దాస్ , ఉపాధ్యక్షుడిగా శివరామకృష్ణ, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీగా రాధాకృష్ణతోపాటు పలువురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు.

కక్ష సాధింపు చర్యే



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్రంలో మెరుగైన వైద్యసేవలను అందించడం కోసం వైద్య కాలేజీల సంఖ్యను పెంచారు. విద్యార్థులకు ఉచితంగా, తక్కువ ఖర్చుతో మెడికల్ విద్యను అందించాలని ఆకాంక్షించి వాటి నిర్మాణం చేపట్టారు. ఆ కాలేజీలలో సీట్లు కేటాయింపులు చేసి నీట్ పరీక్షలు రాసిన విద్యార్థులకు అందులో చదువుకునే అవకాశం కల్పించాలి. కానీ ప్రస్తుత చంద్రబాబు ప్రభుత్వం కాలేజీలను ప్రైవేట్ పరం చేసేందుకు సీట్లు వద్దు అంటూ కేంద్రానికి లేఖ రాయడం దుర్మార్గం. ప్రస్తుత ప్రభుత్వం చేపడుతున్న విధానం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా 1800 మెడికల్ సీట్లు కొల్పోవలసి వస్తుంది. విద్యార్థుల భవిష్యత్తు ఆగమ్య గోచరంగా మారుతుంది.

-డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, జమ్మలమడుగు



ప్రభుత్వం తన వైఖరి మార్చుకోవాలి




పులివెందుల మెడికల్ కళాశాలకు కేటాయించిన 50 మెడికల్ సీట్లను ఈ ప్రభుత్వం కొనసాగించలేమని మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకి లేఖ రాయడం దుర్మార్గం. గత ప్రభుత్వం 17 మెడికల్ కళాశాలను తీసుకువస్తే అందులో పులివెందులలో కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. టీడీపీ కూటమి ప్రభుత్వం రాజకీయ కక్షలో భాగంగానే మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు లేఖ రాసింది. విద్యార్థులు వేలాది రూపాయలు ఫీజులు కట్టి చదువుకొని మెడికల్ సీట్లు సంపాదించుకుంటే, అనుమతి వచ్చిన సీట్లు నడపలేమని తేల్చి చెప్పిన చరిత్ర దేశంలో చంద్రబాబు ప్రభుత్వానికే దక్కుతుంది.

- గుజ్జుల వలరాజు, జిల్లా కార్యదర్శి, ఏఐఎస్ఎఫ్

చిత్తశుద్ధి లేక.. బాబు లేఖ

- మెడికల్ సీట్లు వద్దంటూ చంద్రబాబు లేఖ రాయడంపై విద్యార్థి సంఘాల మండిపాటు
- వైద్య విద్యను ప్రైవేటుపరం చేయడం... ప్రాంతంపై వివక్ష చూపడం తగదు
- బాబు సర్కార్ వల్ల విద్యార్థి లోకానికి తీరని నష్టమని ఆవేదన


పులివెందుల మెడికల్ కళాశాల



సాక్షి ప్రతినిధి, కడప: ప్రజలందరూ సమానమేనన్న విషయాన్ని పాలకులు గుర్తించాలి.. ఏ వ్యక్తిపైనైనా..ఏ ప్రాంతంపైనైనా ద్వేషం లేకుండా పాలన సాగించాలి. అప్పుడే ఆ పాలకుడు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాడు. కానీ.. ప్రస్తుత సీఎం చంద్రబాబు పాలన ఇందుకు పూర్తి భిన్నంగా ఉంది. రాష్ట్రానికి మంజూరైన మెడికల్ సీట్లను వద్దంటూ చంద్రబాబు రాసిన లేఖ ఆయన కక్షపూరిత వైఖరికి అద్దం పడుతోంది. అందివచ్చిన అవకాశాన్ని సైతం ఉద్దేశపూర్వకంగా తిరస్కరిస్తుండడంతో సర్వత్రా ఆగ్రహం పెల్లుబుకుతోంది. రాయలసీమ ప్రజల ఓట్లు కావాలి, కానీ అభివృద్ధి సంబంధం లేదన్నట్లుగా చంద్రబాబు ప్రవర్తిస్తున్నారని పలువురు మండిపడుతున్నారు. సీఎం చంద్రబాబుకు సీమపై ఎప్పుడూ కక్షే. పైగా పులివెందుల అంటే మరింత 'పచ్చ'పాతంతో వ్యవహరిస్తారు. ఈక్రమంలో విద్యార్థి లోకానికీ సైతం తీరని అన్యాయం చేస్తున్నారు. ఎన్ఎంసీ మంజూరు చేసిన 50 మెడికల్ సీట్లు రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించడం దుర్మార్గపు చర్యగా పలువురు వర్ణిస్తున్నారు.

- వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ రూ.530కోట్లతో పులివెందులలో మెడికల్ కళాశాల నిర్మించింది. మౌళిక వసతులు, ఫ్యాకల్టీ తీరు తెన్నులను పరిశీలించిన ఎన్ఎంసీ ఈఏడాది 50ఎంబీబీఎస్ సీట్లు కేటాయిస్తూ ఆగస్టు 5న ఉత్తర్వులు జారీ చేసింది. కాకపోతే పెండింగ్ పనులు ఆటంకం లేకుండా పూర్తి చేస్తామని రాష్ట్ర ప్రభుత్వానికి అండర్ టేకింగ్ లెటర్ కోరింది. రాష్ట్ర ప్రభుత్వ కేవలం చొరవ చూపెట్టి లెటర్ ఎన్ఎంసీకి ఇస్తే, ఈ ఏడాది కౌన్సెలింగ్‌లో 50 మెడికల్ సీట్లు ఎస్వీ యూనివర్శిటీ పరిధిలోకి వస్తాయి. కానీ మెడికల్ కళాశాలను నిర్వహణ చేపట్టలేమని తేల్చి చెబుతూ లెటర్ ఇవ్వడంతో భర్తీ కావాల్సిన మెడికల్ సీట్లు ఎస్వీ యూనివర్శిటీ పరిధిలో కోల్పోవాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు.

అప్పట్లో జీఓ 130 జారీ చేసి...

సిక్స్ పాయింట్ ఫార్ములా ప్రకారం ఎస్వీ యూనివర్శిటీ పరిధిలో పద్మావతి మెడికల్ కళాశాలల్లో సీట్లు రాయలసీమ విద్యార్థులతోనే భర్తీ చేయాల్సి ఉంది. ఈ నిబంధనలను నాటి చంద్రబాబు సర్కార్ తోసి పుచ్చుతూ జీఓ 130 తీసుకొచ్చి రాయలసీమకు తీవ్ర అన్యాయం చేసింది. తాజాగా ఎస్వీ యూనివర్శిటీ పరిధిలో పులివెందుల మెడికల్ కళాశాలకు 50 మెడికల్ సీట్లు ఎన్ఎంసీ కేటాయిస్తే తాజాగా అదే చంద్రబాబు సర్కార్ తిరస్కరించింది. స్వతహాగా సీఎం చంద్రబాబుకు రాయలసీమ అన్నా.. అందులో కడప, పులివెందుల అన్నా ఎక్కడ లేని కోపం, ఆక్రోశం ప్రదర్శిస్తారు. 2014లో ఓ బహిరంగ సభలోనే 'మీరు నాకు ఓటేశారా...మీకు అభివృద్ధి చేయడానికి..? అంటూ ప్రశ్నించారు. ఈమారు ఓట్లు సీట్లు ఇచ్చినా ఈప్రాంతం పట్ల అక్కసు, అసూయ ఇప్పటికీ పోవడం లేదని పలువురు ఆవేదన చెందుతున్నారు. రాయలసీమ ప్రాంత ప్రజా ప్రతినిధులు పులివెందుల మెడికల్ కళాశాలలో సీట్లు భర్తీకి అవసరమైన చర్యలు చేపట్టాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.

రాజకీయ కక్ష సరికాదు



మెడికల్ కళాశాలల విషయంలో ప్రస్తుత కూటమి ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపునకు దిగుతోంది. మెడికల్ సీట్లు పేద విద్యార్థులకు దక్కకుండా ప్రైవేటుకు అప్పజెప్పాలనుకునే నిర్ణయించుకోవడం దుర్మార్గపు చర్య. మెడికల్ సీటు కోసం లక్షలాది రూపాయలు ఫీజులు చెల్లించి కోచింగ్ తీసుకుంటూ, సీటు రాకపోతే ఆత్మహత్య చేసుకున్న సందర్భాలు అనేకం చూశాం. కక్ష సాధింపులలో భాగంగా మెడికల్ సీట్లు వదులుకోవడం సరికాదు. ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకుంటే ఆందోళనలు చేస్తాం.

-రాజేంద్ర ప్రసాద్, జిల్లా కన్వీనర్, అల్ ఇండియా స్టూడెంట్ బ్లాక్

ప్రభుత్వ నిర్ణయం దారుణం



ఎన్ఎంసీ మంజూరు చేసిన మెడికల్ సీట్లు తిరస్కరిస్తూ తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం దారుణం. తమ పిల్లలను డాక్టర్లుగా చూడాలని కలలుగన్న వాళ్లకు ఈ నిర్ణయం ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం పేరుతో మెడికల్ సీట్లను భర్తీ చేయాలనుకోవడం ద్వారా డబ్బున్న వాడికి మెడికల్ సీటు అన్న పరిస్థితి ఏర్పడుతుంది. పేద మధ్య తరగతి పిల్లలకు డాక్టర్ కావాలన్న కల కలగానే మిగిలిపోతుంది.

- వీరనాల శివకుమార్, జిల్లా కార్యదర్శి, డీవైఎఫ్ఐ

గండికోట నుంచి మైలవరానికి నీరు విడుదల


గండికోట నుంచి మైలవరం జలాశయానికి విడుదల చేసిన నీరు

కొండాపురం: గండికోట జలాశయం నుంచి మైలవరం జలాశయానాకి 2500 క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్లు జలవరులశాఖ డీఈ ఉమ మహేశ్వర్లు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో తాగు నీటి అవసరాల కోసం గండికోటనుంచి మైలవరం జలాశయానికి అక్కడ నుంచి పెన్నానదిలో కృష్ణజలాలు వెళ్తున్నాయన్నారు. గండికోట జలాశయంలో శుక్రవారం సాయంత్రానికి 25.1 టిఎంసీల నీటి మట్టం నిల్వ ఉందన్నారు. గండికోట ఎత్తిపోతలపథకం నుంచి మూడు మోటర్లతో 1500 క్యూసెక్కుల నీటిని చిత్రావతి బ్యాలన్స్ రిజర్వాయర్‌కు పంపింగ్ చేస్తున్నామన్నారు. అలాగే జీకే ఎల్ఐ-1 నుంచి ఏడు మోటర్లతో పైడిపాలెం జలాశయానికి 770 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నామన్నారు. గాలేరినగరి సృజల స్రవంతి ప్రధాన కాలువ శెట్టివారిపల్లె హెడ్ రెగ్యూలెటర్ ద్వారా సర్వరాయసాగర్, వామికొండ జలాశయాలకు 700 క్యూసెక్కులనీరు వెళుతోందని వివరించారు.

దువ్వూరు పీహెచ్‌సీ తనిఖీ

దువ్వూరు: దువ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ లక్ష్మణ్ నాయక్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డాక్టర్లు, వైద్య సిబ్బందితో మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా లాంటి వ్యాధులపై ప్రజలకు అందుతున్న సేవలు, తీసుకుంటున్న చర్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. వ్యాధుల పట్ల డాక్టర్లు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వైద్య సేవలు అందించాలన్నారు. అనంతరం ఆస్పత్రిలోని ల్యాబ్‌ను, రికార్డులను, పరిసరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. డాక్టర్లు సురేష్‌బాబు, రోషిణి, వికసిత, హెల్త్ సూపర్‌వైజర్లు రాంగోపాల్, సువర్ణ, విజయకుమారి పాల్గొన్నారు.


డాక్టర్లతో మాట్లాడుతున్న జోనల్ మలేరియా అధికారి డాక్టర్ లక్ష్మణ్ నాయక్

17 నుంచి 'స్వచ్ఛతా హీ సేవ'

కలెక్టర్ శివశంకర్


మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

కడప సెవెన్‌రోడ్స్: అక్టోబరు 2న స్వచ్ఛభారత్ దివస్ నిర్వహించుకుంటున్న నేపథ్యంలో ఈనెల 17 నుంచి వచ్చేనెల 1వ తేది వరకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ శివశంకర్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆర్డీఓలు, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన మాట్లాడారు. అన్ని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై మానవ హారాలు, స్వచ్ఛత పరుగు, వర్క్‌షాప్‌లు తదితర అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, బహిరంగ స్థలాల్లో స్వచ్ఛత ప్రతిజ్ఞ పాటించి శ్రమదానం చేయాలని చెప్పారు. ప్రజాప్రతినిధులు, ప్రముఖులను భాగస్వాములు చేయాలన్నారు. తాగునీటి వనరుల క్లోరినేషన్, ఉద్యాన వనాలు, పర్యాటక కేంద్రాల సుందరీకరణ పనులు చేపట్టాలని ఆదేశించారు. జేసీ అదితిసింగ్, డీఆర్వో గంగాధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్: సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారని జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 11 వేల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైందని పేర్కొన్నారు. 10వ తరగతి పూర్తి చేసి ప్రభుత్వ రంగంలో ఉపాధిని కోరుకునే వారికి ఇది మంచి అవకాశమని వివరించారు. అక్టోబరు 5 నుంచి 14వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు ఎస్ఎస్‌సి.ఎన్ఐసీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

కళాశాల ప్లాటినం జూబ్లీ వేడుకలకు హాజరైన పూర్వ విద్యార్థులు



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, పూర్వ విద్యార్థులు



ఆకట్టుకున్న కళాకారుల సాంస్కృతిక ప్రదర్శన



అంబరాన్నంటిన ఆర్ట్స్ సంబరం

- వైభవంగా ఆర్ట్స్ కళాశాల జూబ్లీ ప్లాటినం వేడుకలు
- 2కే రన్‌లో పాల్గొన్న పూర్వ విద్యార్థులు
- 75 వసంతాల ప్లాటినం జూబ్లీ ఫైలాన్ ఆవిష్కరణ
- డా. ప్రకాష్‌రావుకు అలుమ్నీ లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అందజేత

వైవీయూ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయంప్రతిపత్తి) ప్లాటినం జూబ్లీ వేడుకలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వేడుకల్లో భాగంగా కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ప్లాటినం జూబ్లీ ఫైలాన్‌ను కలెక్టర్ శివశంకర్ లోతేటి, కడప ఎమ్మెల్యే, కళాశాల పూర్వ విద్యార్థి ఆర్. మాధవిరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్ ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ శివశంకర్ లోతేటి, ఎమ్మెల్యే మాధవిరెడ్డి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. 75 సంవత్సరాల వేడుకలకు గుర్తుగా అతిథుల చేతుల మీదుగా కేక్ కట్ చేశారు. అనంతరం 1948లో ప్రారంభమైన నాటి నుంచి 2024 వరకు కళాశాలకు సంబంధించిన అంశాలతో కూడిన సావనీర్‌ను అతిథులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాల అలుమ్నీ లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డును శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డు గ్రహీత, ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ పూర్వపు సంచాలకులు డా. బి.ఎల్.ఎస్. ప్రకాష్‌రావుకు అందజేసి సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ 1948లో ఏర్పాటైన కళాశాల నేటి వరకు ఎదిగిన క్రమాన్ని వివరించారు. ఎందరో ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, పారిశ్రామిక వేత్తలను అందించిందన్నారు. కళాశాల పూర్వ విద్యార్థులు మాజీ వీసీ ఆచార్య రహమతుల్లా, సజ్జల జనార్ధన్‌రెడ్డి, ఆచార్య పి. చిన్నపరెడ్డి, లయన్ కె. చిన్నపరెడ్డి, ఎస్. సత్యనారాయణ, పి. రామచంద్రన్, దాతలు కందుల రాజేశ్వరమ్మ, పోతుల వెంకట్రామిరెడ్డిలతో పాటు పలువురు దాతలను సత్కరించారు. మధ్యాహ్నం అవధాన సాహిత్యంలో సొగసులు అన్న అంశంపై ప్రముఖ అవధాని నరాల రామారెడ్డి, తెలుగుభాష ప్రాశస్త్యంపై డా. సాయిప్రసాద్ ప్రసంగించారు.



డా. బి.ఎల్.ఎస్. ప్రకాష్‌రావుకు అలుమ్నీ లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డు అందజేస్తున్న అతిథులు

సాయంత్రం భరత కళాక్షేత్రం ఆధ్వర్యంలో శ్రీపద్మ శ్రీనివాసం నృత్యరూపకం ప్రదర్శించారు. కార్యక్రమాన్ని సిల్వర్‌జూబ్లీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ ఆచార్య పి. రాజశేఖరరెడ్డి సమన్వయం చేశారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ వీసీ ఆచార్య జి. విశ్వనాథకుమార్, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మూలాలను మర్చిపోకూడదు : కలెక్టర్

తెలుసుకోవాలనే తపన కలిగి మారుతున్న కాలమాన పరిస్థితులకు తగ్గట్టు తనను తాను మార్చుకోవడానికి సిద్ధంగా ఉన్నవారు జీవితంలో రాణిస్తారని కలెక్టర్ శివశంకర్ లోతేటి ఉద్బోధించారు. మనం ఏ స్థాయిలో ఉన్నా మూలాలు మరచిపోకూడదనే విషయాన్ని ఈ కళాశాల అలుమ్ని గుర్తుచేస్తోందన్నారు. డిగ్రీ విద్య దేనికీ తక్కువ కాదని.. ఎంతోమంది ఐఏఎస్, ఐపీఎస్‌లు డిగ్రీతో వచ్చినవారేనని గుర్తుచేశారు. సృజనాత్మక ఆలోచనలు, లోతైన జ్ఞానం ఉన్నవారు గొప్పస్థాయికి ఎదుగుతారన్నారు. కళాశాల పూర్వ విద్యార్థులు తాము చదివిన కళాశాల అభివృద్ధి కృషి చేయడం ప్రశంసనీయమని వారందరిని అభినందించారు.

కళాశాల జ్ఞాపకాలు పదిలం: ఎమ్మెల్యే మాధవిరెడ్డి

కళాశాల అలుమ్ని ప్యాట్రన్, కడప శాసన సభ్యురాలు ఆర్. మాధవిరెడ్డి మాట్లాడుతూ గతంలో ఇక్కడ చదివానని ఇక్కడి జ్ఞాపకాలు నిత్యం నాతో ఉన్నాయన్నారు. విద్యార్థి దశలో విజేతగా ఉంటామా లేదా అనేది ముఖ్యం కాదని ప్రయత్నం ముఖ్యమని అదే విజయతీరాలను చేరుస్తుందని సూచించారు. రాజకీయాలు డర్టీగా మారాయన్నారు. విద్యారంగం అభివృద్ధి కోసం రెండువందల శాతం పనిచేస్తామన్నారు. 75 ఏళ్ల ఉత్సవాల నిర్వహణలో భాగస్వామ్యులైన ప్రతి ఒక్కరూ అభినందనీయులని కితాబిచ్చారు.

ఉత్సాహంగా 2 కే రన్..

శుక్రవారం ఉదయం 7 గంటలకు 75 వసంతాల ప్లాటినం జూబ్లీ వేడుకల్లో భాగంగా కడప నగరంలోని అంబేద్కర్ సర్కిల్ నుంచి ఆర్ట్స్ కళాశాల వరకు 2 కే రన్ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మద్యం సీసాలు స్వాధీనం

రాజుపాళెం : మండలంలోని పగిడాలలో అదే గ్రామానికి చెందిన బత్తల శ్రీనివాసులు అనే వ్యక్తి అక్రమంగా మద్యం అమ్ముతుండగా అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ కత్తి వెంకటరమణ శుక్రవారం తెలిపారు. అతని వద్ద నుంచి 50 క్వార్టర్ల సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

మహిళ అదృశ్యం

పెద్దముడియం : జంగాలపలెకు చెందిన తల్లం సుభద్ర(53) అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సుబ్బారావు తెలిపారు. సుభద్ర కుమారుడు చైతన్య కుమార్ అప్పులు ఎక్కువ చేయడంతో బాకీదారులు నుంచి ఒత్తిడి చేశారు. దీనిపై చైతన్య కుమార్ స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్‌ఐ సుబ్బారావు గురువారం చైతన్య కుమార్ కుటుంబ సభ్యులు, బాకీదారులను స్టేషన్‌కు పిలిపించారు. సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నించగా వారి మధ్య సయోధ్య కుదరకపోవడంతో కోర్టుకు వెళ్లాలని ఎస్‌ఐ తెలిపారు. స్టేషన్ బయటికి వెళ్లిన తర్వాత వారు వాగ్వాదానికి దిగడంతో.. మనస్తాపం చెందిన సుభద్ర భర్తను, కుమారుడిని గ్రామానికి పంపించారు. తాను పెద్దముడియంలోని బంధువుల దగ్గరికి వెళుతున్నానని చెప్పి ఆమె అదృశ్యమైంది. ఈ సంఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చెప్పారు.

ట్రాక్టర్ ఢీకొని ట్రాన్స్‌కో ఏడీకి గాయాలు

ప్రొద్దుటూరు క్రైం : మండల పరిధిలోని దొరసాని పల్లె రైల్వేస్టేషన్ క్రాస్ వద్ద ట్రాక్టర్ ఢీ కొన్న ఘటనలో ఎర్రగుంట్ల ట్రాన్స్‌కో ఏడీ గురుమూర్తికి గాయాలయ్యాయి. ఏడీ గురుమూర్తి దొరసాని పల్లె పంచాయతీలోని రాచమల్లు కాలనీలో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో విధులు ముగించుకొని శుక్రవారం బైక్‌లో ఇంటికి బయలుదేరారు. రైల్వేస్టేషన్ సమీపంలోకి రాగానే ఖాళీ ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఏడీ గురుమూర్తి కుడి కాలు విరిగింది. దీంతో ఆయనను వెంటనే ప్రొద్దుటూరులోని ఒక ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్పించారు. తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని రూరల్ ఎస్‌ఐ మహమ్మద్‌రఫీ తెలిపారు.



దురుద్దేశంతోనే అడ్డుకున్నారు

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పేద విద్యార్థులకు వైద్య విద్య అందించాలనే ఉద్దేశంతో కొత్త ప్రభుత్వ మెడికల్ కాలేజీలను మంజూరు చేసింది. దీని వల్ల 1800 మెడికల్ సీట్లు అందుబాటులోకి వస్తాయి. అయితే ప్రభుత్వ రంగంలో మెడికల్ కాలేజీల నిర్మాణం ఉండకూడదని చంద్రబాబు ప్రభుత్వం భావించి, వీటిని ప్రైవేటు పరం చేసి పేద ప్రజలపై భారం మోపేందుకు ప్రయత్నిస్తోంది. ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఫీజులు తక్కువగా ఉంటాయి. రాష్ట్రంలో నీట్ పరీక్ష రాసిన 5 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో సీట్లు లభిస్తాయని ఎదురు చేస్తున్నారు.

– రమేష్ యాదవ్, ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు.





రూ.లక్షలు పెట్టి చదివించాలంటే భయమేస్తోంది

మధ్య తరగతి కుటుంబానికి చెందిన మేము లక్షల రూపాయలు ఖర్చు పెట్టి పిల్లలను వైద్య విద్య చదివించాలంటే భయమేస్తోంది. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన వైద్య కళాశాలలను చంద్రబాబు ప్రభుత్వం ప్రారంభించకపోవడం దారుణం. ఈ విషయంలో చంద్రబాబునాయుడు ఆలోచన సరైనది కాదు. వెంటనే నిర్ణయాన్ని విరమించుకుని కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన వైద్య సీట్లను రాష్ట్రానికి కేటాయించుకొని కొత్త కళాశాలల ప్రారంభానికి సహకరించాలి. లేకపోతే మాలాంటి వారి పిల్లలకు పెద్ద చదువులు ప్రశ్నార్థకంగా మారుతాయి.

– అరుణ, బోస్‌నగర్, రాయచోటి పట్టణం

నేతలకు మేత.. కూలీలకు వెత

- టీడీపీ వర్గీయులకు 'ఉపాధి'
- కూటమిలో వర్గపోరుతో అధికారులు సతమతం
- యంత్రాలతో నిర్మించే పనులకే అధిక ప్రాధాన్యం





సాక్షి టాస్క్‌ఫోర్స్ : జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా వంద రోజుల పని దినాలను కూలీలకు అందించాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. సాధారణంగా పనుల్లో అత్యధిక శాతం ఉపాధి కూలీలకు ఎక్కువ రోజులు పని దినాలు కల్పించేలా అధిక ప్రాధాన్యం ఇస్తుంటారు. చెరువుల్లో పూడికతీత, గట్ల నిర్మాణం, ఫీడర్ కాలువల తవ్వకాలు, వ్యవసాయ భూముల్లో ఫారంపాండ్స్, నీటి కందకాలు లాంటి పనులకు గతంలో ఎక్కువగా కేటాయించడంతో ఉపాధి హామీ కూలీలకు న్యాయం జరిగేది. అయితే ఇందుకు భిన్నంగా తాజాగా టీడీపీ వర్గీయుల ఆర్థిక ప్రయోజనాల కోసం ఉపాధి హామీ కూలీల పని దినాలపై కూటమి ప్రభుత్వం కత్తి కట్టింది. తంబళ్లపల్లి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఇటీవల గ్రామసభలను అధికారులు నామమాత్రంగా నిర్వహించారు. తెలుగు తమ్ముళ్లు లబ్ధి పొందేలా ఈసారి పూర్తిగా యంత్రాలను ఉపయోగించి నిర్మించే సిమెంటు రోడ్లు, మురికి కాలువలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారు. నియోజకవర్గంలోని సిమెంటు రోడ్ల మంజూరు కోసం టీడీపీ నేతల ఆదేశాలతో అధికారులు రూ.4 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధ చేశారు. పూర్తిగా యంత్రాల ద్వారా చేపట్టే ఇలాంటి పనుల ద్వారా ఉపాధి కూలీలకు నష్టం వాటిల్లనుంది.

తమ్ముళ్లకు సహకరించాలని సిబ్బందిపై ఉన్నతాధికారి ఒత్తిళ్లు

తంబళ్లపల్లి నియోజకవర్గంలోని టీడీపీలో నెలకొన్న వర్గపోరుతో అధికారులు సతమతమవుతున్నారు. టీడీపీలోనే నాలుగు గ్రూపులు ఏర్పడటంతో ఎవరికి సహకరించాలో.. ఎవరికి సహకరించకపోతే ఎలాంటి ఇబ్బందులు తలెత్తుతాయోనని అధికారులు ఆందోళనతో ఉన్నారు. ఇదిలా ఉండగా ఉపాధి హామీలో పని చేస్తున్న ఓ ఉన్నతాధికారి మాత్రం పనులు ఎలా చేసినా, చేయకపోయినా తెలుగు తమ్ముళ్లకే మీరంతా బిల్లులు పెట్టి సహకరించాలని మండల స్థాయిలో పని చేస్తున్న క్షేత్ర, సాంకేతిక సిబ్బందిపై తీవ్ర ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం. దీంతో తమ జీవితాలను పణంగా పెట్టి దొంగ బిల్లులు పెట్టే కన్నా.. సెలవులో లేదా బదిలీ అయి వెళ్లడం నయమని పలువురు ఎఫ్‌ఏ, టీఏలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే తామంతా గతంలో నాయకులు చేసిన రాజకీయ ఒత్తిళ్ల కారణంగా ఎవరో చేసిన తప్పులకు 15 ఏళ్లుగా కోర్టులు, లాయర్ల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నామని వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

రూ.4 కోట్లతో సిమెంటు రోడ్లకు ప్రతిపాదనలు

నియోజకవర్గంలోని ఆరు మండలాలకు కలిపి రూ.4 కోట్లతో సిమెంట్ల రోడ్ల మంజూరుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందులో టీడీపీ నాయకుడు జయచంద్రారెడ్డి సొంత మండలానికే రూ.1.87 కోట్ల నిధులకు ప్రతిపాదనలు తయారు చేయడంపై కూటమిలోని మిగిలిన వర్గీయులు భగ్గుమంటున్నారు.

మండలాల వారీగా సిమెంటు రోడ్ల మంజూరుకు నిధుల వివరాలు

మండలం	పనుల సంఖ్య	సీసీ రోడ్లు (మీటర్లలో)	నిధులు (రూ.లలో)
ములకలచెరువు	59	4,710	1.87 కోట్లు
బి.కొత్తకోట	8	832	33 లక్షలు
కురబలకోట	15	1779	69 లక్షలు
పెద్దతిప్పసముద్రం	28	1586	63 లక్షలు
తంబళ్లపల్లి	9	900	32 లక్షలు
పెద్దమండ్యం	4	1300	16 లక్షలు

ఏకదంతుడి లడ్డూకు భలే డిమాండ్

లంబోదరుడి లడ్డూకు భలే డిమాండ్ లభిస్తోంది. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజైన శుక్రవారం పలు ప్రాంతాల్లో వేలం పాట నిర్వహించారు. ఇందులో భక్తులు పోటాపోటీగా పాల్గొన్నారు. రికార్డు ధరకు పాట పాడి, స్వామి వారి ప్రసాదం దక్కించుకున్నారు. తమకు లభించడం అదృష్టంగా భావిస్తున్నామని వారు తెలిపారు. మండపం నుంచి ఊరేగింపుగా తీసుకెళ్లి పంపిణీ చేశారు.

మారయ్యగారిపల్లెలో రూ.3 లక్షలు



ఒంటిమిట్ట : మండల పరిధి మంటపంపల్లి పంచాయతీలోని మారయ్యగారిపల్లెలో వెంకటస్వామి దేవాలయం వద్ద వినాయకుడి లడ్డూ వేలంపాట నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన గడ్డం వెంకటశివారెడ్డి రూ.3 లక్షలకు దక్కించుకున్నారు.

చియ్యపాడులో రూ.57 వేలు



చాపాడు : మండల పరిధిలోని చియ్యపాడులో నాయీ బ్రాహ్మణుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేషుడి ప్రతిమ వద్ద లడ్డూ వేలం పాట నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన వీర మణికంఠ, ధనహరి దంపతులు రూ.57 వేలకు పొందారు.

ఎర్రగుంట్లలో రూ.51 వేలు



ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణంలోని రాణివనంలో గణపయ్య లడ్డూ రూ.51 వేలకు అడపాల శ్రీనాథ్‌కు లభించింది. ఊరేగింపుగా ఆయన ఇంటికి తీసుకెళ్లారు.

చిన్నారి మృతిపై ఆస్పత్రి వద్ద ఆందోళన





మృతి చెందిన చిన్నారి జస్సికాశ్రీ, రోదిస్తున్న చిన్నారి తల్లి సుమలత

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని గాంధీరోడ్డులో ఉన్న ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఏడాదిన్నర వయసు గల జసికాశ్రీ అనే చిన్నారి శుక్రవారం రాత్రి మృతి చెందింది. అయితే వైద్యుడి నిర్లక్ష్యం మూలంగానే చిన్నారి మృతి చెందిందని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. చాపాడు మండలంలోని నక్కలదిన్నె గ్రామానికి చెందిన సుమలత, బాలఎల్లయ్యల కుమార్తె జసికాశ్రీకి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో గాంధీరోడ్డులోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు. ఈ క్రమంలో చిన్నారిని గురువారం సాయంత్రం ఆస్పత్రికి తీసుకొచ్చారు. పరీక్షించిన వైద్యురాలు ఆయాసం ఎక్కువగా ఉండటంతో పాటు ఊపిరితిత్తుల్లో నెమ్ము చేరిందన్నారు. ఆస్పత్రిలో అడ్మిట్ కావాలని చెప్పడంతో ఉదయం వస్తామని చిన్నారిని తీసుకొని తల్లిదండ్రులు ఇంటికి వెళ్లిపోయారు. అయితే పాప ఆరోగ్యం బాగ లేని కారణంగా శుక్రవారం సాయంత్రం ఆస్పత్రికి వచ్చారు. పరీక్షించిన వైద్యురాలు చికిత్స ప్రారంభించారు. అయితే కొద్ది సేపటి తర్వాత చిన్నారి మృతి చెందింది. చిన్నారి కుటుంబ సభ్యులు, బంధువులు ఆస్పత్రి వద్ద ఆందోళన చేయడంతో త్రీ టౌన్ సీఐ గోవిందరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పాప ఆరోగ్యం సరిగా లేకపోవడంతోనే గురువారం రాత్రి ఆస్పత్రిలో అడ్మిట్ కావాలని తల్లిదండ్రులకు సూచించామని, అయినా వారు అడ్మిట్ కాకుండా ఉదయం వస్తామని వెళ్లిపోయినట్లు ఆస్పత్రి వైద్యులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే వారు శుక్రవారం సాయంత్రం ఆస్పత్రికి వచ్చారన్నారు. ఊపిరితిత్తుల్లో నెమ్ము ఎక్కువగా ఉండటంతో చిన్నారికి చికిత్స ప్రారంభించామని, ఇందులో తమ నిర్లక్ష్యం ఏ మాత్రం లేదన్నారు. చిన్నారి కుటుంబ సభ్యులు మాత్రం వైద్యురాలు నిర్లక్ష్యం మూలంగానే తమ పాప చనిపోయిందని ఆరోపిస్తున్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడా షెడ్యూలు విడుదల

కడప స్పోర్ట్స్ : పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి నిర్వహించనున్న క్రీడల షెడ్యూలును జిల్లా విద్యాశాఖాధికారి ఎం.అనురాధ, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.అరుణకుమారి శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి మాట్లాడుతూ సెప్టెంబర్ 17 నుంచి 21వ తేదీ వరకు మండల స్థాయి ఎంపికలను మండల కోఆర్డినేటర్ ఆధ్వర్యంలో నిర్వహించాలని సూచించారు. ఈనెల 23 నుంచి 26వ తేదీ వరకు అండర్–14, అండర్–17 బాలబాలికలకు నియోజకవర్గస్థాయి ఎంపికలను నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆధ్వర్యంలో నిర్వహించాలని సూచించారు. కాగా ఫుట్‌బాల్, జూడో, టేబుల్ టెన్నిస్ క్రీడాంశాలకు మాత్రం నేరుగా జిల్లాస్థాయి ఎంపికలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

తేదీ	క్రీడాంశం	వేదిక	బాధ్య ఫిజికల్ డైరెక్టర్
18-09-24	ఫుట్‌బాల్	వైఎస్‌ఆర్ క్రీడాపాఠశాల, కడప	పి. తిరుపాల్‌రెడ్డి, అమృతరాజ్
19-09-24	జూడో	వైఎస్‌ఆర్ ఇండోర్ స్టేడియం, కడప	ఎల్. వెంకటలక్ష్మి
20-09-24	టేబుల్ టెన్నిస్	జార్జ్‌క్లబ్, ప్రొద్దుటూరు	వి.వి.శివారెడ్డి, శంకర్

అబలలకు అండగా మహిళా కమిషన్

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి



మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి

కడప కోటిరెడ్డిసర్కిల్ : అబలలకు అండగా మహిళా కమిషన్ ఎల్లవేళలా పని చేస్తుందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి తెలిపారు. రాష్ట్రంలో మహిళా సాధికారత, రక్షణ, భద్రత కోసం కృషి చేస్తుందని పేర్కొన్నారు. శుక్రవారం రాష్ట్రీయ పోషణ్ మా కార్యక్రమం సందర్భంగా కడప మహిళా సబ్ జైలును ఆమె సందర్శించారు. మహిళా ఖైదీలను పరామర్శించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలు ప్రారంభించి, ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో గ్రీవెన్స్‌సెల్ నిర్వహించారు. లైంగిక, వరకట్న వేధింపులు, సైబర్ నేరాలు, గృహ హింస, అపహరణ, వెట్టి చాకిరీ వంటి నేరాలకు గురైన బాధిత మహిళల ఫిర్యాదులు స్వీకరించారు. తరువాత నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జాతీయ మహిళా కమిషన్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా కార్యక్రమం అయిన రాష్ట్రీయ 7వ 'పోషణ్ మా' (పోషకాహార నెల) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పోషకాహారం ప్రతి ఒక్క మహిళకు, పిల్లలకు కచ్చితంగా అందాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని పేర్కొన్నారు. ఇందుకోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టినట్లు చెప్పారు. వీటిపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమం రెండేళ్ల క్రితం కూడా నిర్వహించినట్లు తెలిపారు. రాయలసీమలోని వైఎస్సార్, కర్నూలు జిల్లాల్లో కూడా చేపట్టడం జరిగిందన్నారు. ఈ రోజు ముఖ్యంగా జైళ్లలోని మహిళా ఖైదీల సమస్యలు తెలుసుకునేందుకు కేటాయించినట్లు చెప్పారు. వారు ఎటువంటి సౌకర్యాలు పొందుతున్నారు, వారికి బలవర్ధకమైన ఆహారాన్ని అందిస్తున్నారా లేదా అనే విషయాలు పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. వారికి పోషక ఆహారం అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వైద్య శిబిరాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ఏడాది రాష్ట్రంలో పోషణ్ మా కార్యక్రమం కర్నూలు, కడప, రాజమండ్రి సబ్‌జైళ్లలో నిర్వహించడం జరుగుతోందని వివరించారు. కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు హాస్టల్ సంఘటనను సీరియస్‌గా తీసుకున్నామని తెలిపారు. ఈ ఘటనపై అనేక అనుమానాలు ఉన్నాయని, సమగ్రంగా విచారణ చేపట్టామన్నారు. అందులో భాగంగానే అక్కడున్న వార్డెన్, ప్రిన్సిపాల్, సిబ్బందికి నోటీసులు ఇచ్చామన్నారు. విద్యార్థినుల జీవితాలతో చెలగాటం ఆడుకోవడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ వెల్ఫేర్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెక్రటరీ వసంత బాల, ఉమెన్ కమిషన్ లీగల్ కౌన్సిలర్ పూజిత, నోడల్ ఆఫీసర్ వాణి, ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి, సీడీపీఓ సునంద, ఏసీడీపీఓ శోభ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్

దువ్వూరు : మండలంలోని చల్లబసాయపల్లె ఎస్‌ఆర్–1 డ్యాం వద్ద గంజాయి అమ్ముతున్న చిన్నశింగనపల్లె గ్రామానికి చెందిన గిద్దలూరు చాపల దస్తగిరి అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు మైదుకూరు రూరల్ సీఐ శివశంకర్, దువ్వూరు ఎస్‌ఐ వినోద్‌కుమార్ శుక్రవారం తెలిపారు. అతని వద్ద నుంచి 1450 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని, దీని విలువ సుమారు రూ.15 వేలు ఉంటుందన్నారు. అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వారు చెప్పారు.

చౌక బియ్యం పట్టివేత

రాజుపాళెం : మండలంలోని వెలవలి గ్రామం సాయిబాబా దేవాలయం వద్ద శుక్రవారం అక్రమంగా చౌక బియ్యం తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ కత్తి వెంకటరమణ తెలిపారు. దువ్వూరుకు చెందిన కదిరి దస్తగిరయ్య, దువ్వూరు మండలం పెద్దజొన్నవరం గ్రామానికి చెందిన కొక్కోళ్ల పుల్లయ్య మండలంలోని పలు గ్రామాల్లో లబ్ధిదారుల నుంచి చౌక దుకాణం బియ్యం తక్కువ రేటుకు కొని ఎక్కువ రేటుకు అమ్ముకునే ప్రయత్నం చేస్తున్నారని ఎస్‌ఐ పేర్కొన్నారు. 92 బస్తాల బియ్యాన్ని వ్యాన్‌లో తీసుకొని ప్రొద్దుటూరుకు వెళ్తుండగా అరెస్టు చేశామన్నారు. బియ్యం, వ్యాన్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

పోలీసుల అదుపులో..

వల్లూరు (చెన్నూరు) : ప్రభుత్వ పేద వర్గాలకు రేషన్‌కార్డుల ద్వారా పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తుండగా శుక్రవారం సాయంత్రం చెన్నూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కేసు వెంకటసుబ్బారెడ్డి గోడౌన్ నుంచి వ్యాపారి బ్రహ్మయ్య ఆధ్వర్యంలో సుమారు 350 బస్తాలకు పైగా రేషన్ బియ్యం తరలిస్తుండగా సీఐ పురుషోత్తంరాజు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఈ సంఘటనలో రెండు ఐచర్ వాహనాలు, రెండు ఆటోలను సైతం పోలీసులను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు వాహనాలను చెన్నూరు పోలీసుస్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



మృతి చెందిన పి.బాలయ్య

పెండ్లిమర్రి : జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. పెండ్లిమర్రి మండలంలోని మిట్టమీద పల్లె గ్రామం వద్ద కడప–పులివెందుల ప్రధాన రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. మిట్టమీదపల్లె గ్రామానికి చెందిన పి.బాలయ్య(58) తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్లి రహదరి పక్కన కూర్చొని ఉండగా.. వేంపల్లె వైపు నుంచి కడప వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మోటార్‌సైకిల్ ఢీకొని..

కడప అర్బన్ : కడప నగరం ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎర్రముక్కపల్లి రోడ్డులో శుక్రవారం మధ్యాహ్నం మోటార్‌సైకిల్‌పై వేగంగా వచ్చి రాజేశ్వరి (50) అనే మహిళను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళను ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. దేవునికడపకు చెందిన రాజేశ్వరి ఎర్రముక్కపల్లిలోని ఓ వస్త్ర దుకాణంలో పని చేస్తోంది. మధ్యాహ్నం విధులు ముగించుకుని బయటకు రాగానే ఈ ప్రమాదం జరిగింది. ఈ సంఘటనపై బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జి.అమర్‌నాథ్‌రెడ్డి తెలియజేశారు.

వినాయక ఉత్సవ కమిటీల మధ్య ఘర్షణ

ఇద్దరికి గాయాలు



గాయపడిన మధుసూధన్, రెడ్డి తులసిరాం

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణంలోని వేంపల్లి రోడ్డులో విద్యుత్ శాఖ కార్యాలయం ఎదురుగా గురువారం రాత్రి వినాయక ఉత్సవ కమిటీల మధ్య మాటకుమాట పెరిగి ఘర్షణ చోటు చేసుకుంది. ఇందులో ఇద్దరికి గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వేంపల్లి రోడ్డులోని మెయిన్ బజార్, పుష్పగిరి మాన్యంలోని వడ్డెర కాలనీలో ఒక్కో విగ్రహం ఏర్పాటు చేశారు. ఈ విగ్రహాల కమిటీల మధ్య మనస్పర్థలు ఉండటం, పాత కక్షల కారణంగా గురువారం రాత్రి ఘర్షణ పడ్డారు. మధుసూధన్, రెడ్డితులసిరాం వేంపల్లి రోడ్డులోని మెయిన్ బజార్‌లో ఉండగా.. వడ్డెర కాలనీలోని ఉత్సవ కమిటీ నిర్వాహకులు మరి కొందరు కలిసి దాడి చేశారు. ఇందులో మదుసూధన్‌రెడ్డి, తులసిరాంలకు తీవ్ర గాయాలు అయ్యాయి. వారిని ప్రొద్దుటూరు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నరేష్‌బాబు తెలిపారు.

నిమజ్జనానికి వెళ్లి వచ్చి గుండెపోటుతో మృతి



ప్రశాంత్ మృతదేహం

మదనపల్లె : వినాయక విగ్రహ నిమజ్జనం సందర్భంగా ఆటాపాటలతో సందడి చేసిన ఓ యువకుడు ఇంటికి వచ్చిన తర్వాత హఠాత్తుగా గుండెపోటుతో మృతి చెందిన సంఘటన మదనపల్లె మండలంలో జరిగింది. వలసపల్లె పంచాయతీ కృష్ణాపురానికి చెందిన ఆటో డ్రైవర్ ప్రశాంత్(25) మొలకలదిన్నెలో జరుగుతున్న వినాయక నిమజ్జనానికి వెళ్లాడు. వేడుకలో ఉత్సాహంగా పాల్గొన్నాడు. కేరింతలు కొడుతూ డ్యాన్స్ వేశాడు. స్నేహితులతో కలిసి రంగులు చల్లుకుని సరదాగా గడిపాడు. అనంతరం ఇంటికి వెళ్లి దుస్తులు మార్చుకుంటూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన ప్రశాంత్‌ను కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

ఎస్టీయూఫ్ నాయకులకు షోకాజ్ నోటీసు

కడప ఎడ్యుకేషన్ : సెప్టెంబర్ 4వ తేదీ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపిక విషయమై డీఈఓ కార్యాలయంలో ఎస్టీయూఫ్ నాయకులు, డీఈఓ కార్యాలయ సిబ్బంది మధ్య వాదోపవాదాలు చోటు చేసుకున్న విషయం విదితమే. ఈ విషయమై అటు ఎస్టీయూఫ్, ఇటు డీఈఓ కార్యాలయ నాన్ టీచింగ్ అసోసియేషన్ నాయకులు డీఈఓ కార్యాలయం వద్ద నిరసనలు చేయడం జరిగింది. ఈ నిరసనల వల్ల డీఈఓతోపాటు ఉద్యోగుల విధులకు ఆటంకం ఏర్పడటంతో శుక్రవారం డీఈఓ మర్రెడ్డి అనురాధ ఎస్టీయూఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులతోపాటు జిల్లా నాయకులు ఆవుల శ్రీనివాసులు, రామచంద్రా, రాజగోపాల్‌రెడ్డి, విద్యాసాగర్, బాలకృష్ణ, మహేశ్వరెడ్డిలకు, అలాగే డీఈఓ కార్యాలయ నాన్ టీచింగ్ సిబ్బంది రమేష్, క్రిష్టారెడ్డి, లిఖిలేష్‌లకు షోకాజ్ నోటీసులను జారీ చేసినట్లు తెలిపారు. ఈ నోటీసులకు మూడు రోజుల్లో వారంతా వివరణ ఇవ్వాలని ఆదేశించినట్లు ఆమె పేర్కొన్నారు.

తండ్రి మందలించాడని కుమార్తె ఆత్మహత్య



మృతి చెందిన ప్రసన్న

జమ్మలమడుగు రూరల్ : తండ్రి మందలించాడని కూతురు ఆత్మహత్య చేసుకున్న సంఘటన జమ్మలమడుగులో చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ ఖాదర్‌వలి ఇచ్చిన వివరాలు ఇలా ఉన్నాయి. మునిసిపాలిటీ పరిధిలోని దుత్తలూరు గ్రామానికి చెందిన ప్రసన్న (16) అనే విద్యార్థిని పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుంది. శుక్రవారం కళాశాలకు వెళ్లలేదని తండ్రి మందలించాడు. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో స్లాబ్ కడ్డీలకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు వచ్చి చూడగా అప్పటికే మృతి చెందింది. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.